ఉచిత శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు

ఘట్‌కేసర్: నిరుద్యోగ యువతీ, యువకులు సత్యసాయి ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ పావని జంగయ్య అన్నారు. ఘట్‌కేసర్‌లో గురువారం ఆమె మాట్లాడుతూ.. సత్యసాయి ఉచిత శిక్షణలో బ్యాంకింగ్, ఫైనాన్స్, స్పోకెన్ ఇంగ్లిష్, ఇంటర్వ్యూ స్కిల్స్‌లో ఉచిత శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పిస్తారన్నారు. 8వ తరగతి నుంచి ఇంటర్, డిగ్రీ చదువుతున్న వారు ఈ నెల 11న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఆరో వార్డులోని మహిళా మండలి భవనంలో అభ్యర్థులు తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.



అమ్మాయి పుడితే మేలు..

మేడ్చల్‌రూరల్/మేడ్చల్: ఒకప్పుడు అమ్మాయి పుడితే భారంగా భావించే వారని, ఇప్పుడు మేలు అనుకుంటున్నారని అమెరికాలోని హాస్పిస్ క్యాన్సర్ హౌస్ మెడికల్ డైరెక్టర్, అంకాలజిస్ట్ డాక్టర్ రోహిణి అన్నారు. మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలత, డైరెక్టర్ సరోజారెడ్డి, కళాశాల సెక్రటరీ టీవీ రెడ్డి, కో–ఆర్డినేటర్లు సరిత, హర్షరెడ్డి, ప్రమోదిత నంద్య, పీఆర్వో రవి సుధాకర్ పాల్గొన్నారు.

మేడ్చల్ డిపోలో..

మేడ్చల్ డిపోలో మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అత్యధిక ఆదాయం తెచ్చిన మహిళా కండక్టర్లను ప్రశంసాపత్రాలు, శాలువాతో డిపో మేనేజర్ సుధాకర్ సన్మానించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ రామారావు, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలోని నాల్గవ వార్డులోని ఉపాధ్యాయులు, అంగన్‌వాడి, ఆశా వర్కర్లు, మహిళా వైద్యులను కౌన్సిలర్ అమరం సరస్వతి మోహన్‌రెడ్డి సన్మానించారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా ఆరోగ్య అధికారి రఘునాథస్వామి



అవుషాపూర్‌లో ఎంపీడీఓ గీతారెడ్డిని, పారిశుద్ధ్య కార్మికులను సన్మానిస్తున్న ఎంపీటీసీ సభ్యురాలు శోభారెడ్డి

కలెక్టరేట్‌లో మహిళా దినోత్సవం

సాక్షి, మేడ్చల్ జిల్లా: జిల్లా సంక్షేమ శాఖ అధ్వర్యంలో అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం కలెక్టరేట్లో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. మహిళల విద్య, ఆరోగ్యంతో పాటు వారి హక్కులను డీఆర్‌ఓ హరిప్రియ ఈ సందర్భంగా వివరించారు. మహిళలను అన్ని రంగాలలో ప్రోత్సహించేందుకు, వారికి తగిన రక్షణ కల్పించేందుకు తగిన చర్యలు చేపట్టాలని వివరించారు. కార్యక్రమంలో జిల్లా ఆరోగ్య అధికారి డాక్టర్ టి.రఘునాథస్వామి, జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారులు, సీడీపీఓలు, మహిళా ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు శైలజ, రాగజ్యోతి, ప్రణీత, అనిత, పావని, సరిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి ఎం.కృష్ణారెడ్డి మహిళా దినోత్సవ సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మహిళలు ఆర్థికంగా, సామాజికంగా సాధికారత సాధించాలని పేర్కొన్నారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనపరిచిన మహిళ ఉద్యోగులకు, ఆటల పోటీలలో గెలుపొందిన మహిళలకు బహుమతులు అందజేశారు.

అన్ని రంగాల్లో మహిళలు ముందంజ

ఘట్‌కేసర్: మహిళలు నేడు అన్ని రంగాల్లో ముందుకెళ్తున్నారని కొమ్మూరి ప్రతాపరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల(కేపీఆర్‌ఐటీ) డైరెక్టర్ కొమ్మూరి దివ్యారెడ్డి అన్నారు. గురువారం కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన దివ్యారెడ్డి మాట్లాడుతూ.. పురుషులకు దీటుగా మహిళలు సేవలు అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో కేపీఆర్‌ఐటీ కోశాధికారి ప్రియాంక రెడ్డి, హైకోర్టు లాయర్ కీర్తిరెడ్డి, సీఈఓ అమృత వర్షిని, దీప్తిరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రావు, ఈశ్వర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగులకు సత్కారం

ఘట్‌కేసర్: అంతర్జాతీయ మహిళ దినోత్సవ వేడుకల్లో భాగంగా ఘట్‌కేసర్ మండల పరిషత్ కార్యాయలంలో ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, అంకుషాపూర్ పంచాయతీ కార్యాలయంలో ఎంపీటీసీ శోభారాణి దామోదర్‌రెడ్డి ఆధ్వర్యంలో మహిళ ఉద్యోగులను గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ గీతారెడ్డిని, మండల ప్రజా పరిషత్ కార్యాలయ సిబ్బందిని, అవుషాపూర్ పంచాయతీ కార్యాలయ పారిశుద్ధ్య కార్మికులను శాలువ.. పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, అధికారులు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో మహిళలు రాణించాలి



మేడ్చల్‌రూరల్: రాబోయే తరాలకు ఉజ్వల భవిష్యత్తును సృష్టించే అవకాశం మహిళలతోనే సాధ్యమని మల్లారెడ్డి గ్రూప్స్ విద్యా సంస్థల డైరెక్టర్ శాలినీరెడ్డి అన్నారు. మైసమ్మగూడలోని మల్లారెడ్డి మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శాలినీరెడ్డి మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. గ్లోబల్ టెక్నాలజీ లీడర్ రామిడి లేఖ మాట్లాడుతూ.. లింగ సమానత్వం కోసం డిజిటల్ ఆవిష్కరణలు అవసరం అన్నారు.

హక్కుల కోసం..



జవహర్‌నగర్: స్థానిక గిరిప్రసాద్‌నగర్ కాలనీలో రాజేశ్వరి ఆధ్వర్యంలో మహిళా సమాఖ్య సమక్షంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మహిళా సమాఖ్య కార్యదర్శి జె.లక్ష్మి మాట్లాడుతూ.. మహిళల హక్కుల కోసం పోరాటాలు ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంతోష్‌యాదవ్, పద్మయాదవ్, శ్యామల, లత, స్వరూప, పద్మమ్మ, జయ, లక్ష్మి, కవిత, నర్సమ్మ, మల్లిక, సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు తోటపల్లి శంకర్, లక్ష్మణ్, సహదేవ్, జంగయ్యయాదవ్, ఎల్లయ్య పాల్గొన్నారు.

వీడని సీలింగ్ భూమి మిస్టరీ

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ మున్సిపాలిటీ నర్సరీ భూమి గాయబ్ మిస్టరీ ఇంకా వీడలేదు. రెవెన్యూ రికార్డుల ప్రకారం సీలింగ్ భూమి ఎక్కడుందనే విషయమై సందిగ్ధత కొనసాగుతోంది. మున్సిపల్ అధికారులు నర్సరీ భూమి సీలింగ్ భూమిగా ప్రకటిస్తున్నారు. అయితే, రెవెన్యూ అధికారులు మాత్రం సీలింగ్ భూమిని గుర్తించడంలో విఫలం అవుతున్నారు. కాగా, సీలింగ్ భూమి కాపాడాలని, కబ్జా చేయాలని ప్రయత్నిస్తున్న వ్యక్తి నుంచి రక్షించాలని ప్రభుత్వం నుంచి భూమి పొందిన ఎర్ర మైసయ్య ఈ నెల 2న కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కానీ, సర్వే నంబర్ 127/బీలో ఉన్న 1.39 ఎకరాల సీలింగ్ భూమి పీఓటీ(ప్రొహిబిషన్ ఆఫ్ ట్రాన్స్‌ఫర్) కింద ఎందుకు స్వాధీనం చేసుకోకూడదో సమాధానం ఇవ్వాలంటూ ఈ నెల 3న భూయజమాని ఎర్ర మైసయ్యకు స్థానిక రెవెన్యూ అధికారులు నోటీసులిచ్చారు.

ఆర్డీఓకు రెవెన్యూ అధికారుల లేఖ..

సీలింగ్ భూమి వ్యవహారంపై రెవెన్యూ అధికారులు సీలింగ్ భూమి ఫైల్ నెంబర్ సీసీ/3190/ఈ/ 76 వివరాల కోసం కీసర ఆర్డీఓకు లేఖ పంపించారు. కానీ, సీలింగ్ భూమిని సర్వే చేయించిన అధికారులు సర్వే స్కెచ్ బయట పెట్టకపోవడంపై స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూ అధికారులకు చిత్తశుద్ధి ఉంటే యుద్ధప్రాతిపదికన విచారణ జరపడంతో పాటు అందులో వాకింగ్ ట్రాక్ కానీ చిన్నపిల్లల పార్కు లేదంటే రైతుబజారు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



ఘట్‌కేసర్ నర్సరీలో పనులు చేస్తున్న కార్మికులు

మద్యం మత్తులో ఆత్మహత్య

జవహర్‌నగర్: మద్యం మత్తులో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. బాలాజీనగర్ చంద్రపురి కాలనీలో సింహాద్రి నాగరాజు(36), భార్య కల్యాణి, కుమార్తెతో కలిసి ఉంటున్నాడు. నాగరాజు సెంట్రింగ్ పనులు చేస్తుంటాడు. అయితే, అతనికి గతంలోనే వివాహం కాగా.. ఆమెతో విడాకులు తీసుకొని కల్యాణిని పెళ్లి చేసుకున్నాడు. నాగరాజుకు నిత్యం తాగి భార్యను వేధించేవాడు. ఈ నెల 6వ తేదీన కూడా మద్యం తాగి ఇంటికి రాగా గొడవపడిన కల్యాణి దమ్మాయిగూడలోని అమ్మమ్మ ఇంటికి పిల్లలతో సహా వెళ్లింది. గురువారం ఉదయం కల్యాణి.. నాగరాజుకు ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందించకపోవడంతో ఇంటికి వచ్చి చూసింది. నాగరాజు సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకొని కనిపించాడు. కాగా, నాగరాజు గతంలో పలుమార్లు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని కల్యాణి ఫిర్యాదులో పేర్కొంది.

‘నంద్యాల’ మృతుల అంత్యక్రియలు పూర్తి

అలియాబాద్‌లో విషాదఛాయలు

శామీర్‌పేట్: నంద్యాలలో జరిగిన రోడ్డు ప్రమాదంలో అమ్మానాన్న, కుమారుడు, కోడలు(నవ దంపతులు)తో సహా డ్రైవర్ మృతి మృతి చెందిన విషయం విధితమే. ఇందుకు సంబంధించిన వివరాలు.. మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలం అలియాబాద్ గ్రామానికి చెందిన మంత్రి రవీందర్‌లక్ష్మికి బాలకిరణ్ (29), ఉదయ్‌కిరణ్, సాయికిరణ్ సంతానం. కాగా వీరు అల్వాల్‌లోని వెంకటాపురంలో నివాసం ఉంటున్నారు. పెద్దకొడుకు బాలకిరణ్‌కు గత నెలలో తెనాలికి చెందిన కావ్యతో వివాహం జరగగా తిరుపతి దర్శనానికి వెళ్లి వస్తున్నారు. అయితే, వీరు ప్రయాణిస్తున్న కారు బుధవారం తెల్లవారుజామున ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల వద్ద ఆగి ఉన్న లారీని వెనక నుంచి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ఐదుగురు మృతి చెందారు. కాగా వీరి అంత్యక్రియలు స్వగ్రామం అలియాబాద్‌లో గురువారం జరిగాయి. ఇదిలా ఉండగా, ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి చెందడంతో అలియాబాద్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి. కాగా, అమ్మానాన్న, అన్న, వదినకు ఉదయ్‌కిరణ్ అంత్యక్రియలు నిర్వహించాడు.



అలియాబాద్‌లో అంత్యక్రియలు

మనస్థాపంతో వృద్ధుడు ..



శామీర్‌పేట్: స్థలం విషయంలో మనస్థాపానికి గురైన వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబీకులు, స్థానికులు తెలిపిన వివరాలు.. మూడుచింతలపల్లి మండలంలోని కేశ్వాపూర్ గ్రామానికి చెందిన యన్నం పెంటయ్య(80)కు తన ఇంటి వద్దనున్న స్థలం విషయంలో స్థానికులతో గొడవ జరిగింది. దీంతో మనస్థాపం చెందిన పెంటయ్య ఇంట్లో ఉరివేసుకున్నాడు.

నాగారం మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి



సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న సభ్యులు

కీసర: నాగారం మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. గురువారం నిర్వహించిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. నాగారం, రాంపల్లి నాలాల క్లీనింగ్ కోసం పట్టణ ప్రగతి నిధుల ద్వారా రూ.10 లక్షలు, రాంపల్లి హిందూ శ్మశానవాటికలో బ్యాలెన్స్ పనుల కోసం పట్టణ ప్రగతి నిధుల ద్వారా రూ.15 లక్షలు, వీధి దీపాల నిర్వహణ.. ఎలక్ట్రికల్ బిల్లుల చెల్లింపుల కోసం రూ 1.98 కోట్లు వెచ్చించేందుకు తీర్మానించామన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ బండారి మల్లేశ్‌యాదవ్, కమిషనర్ రాజేంద్రకుమార్, మేనేజర్ చంద్రశేఖర్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

నిరంతర అభ్యాసంతో విజయాలు



అధ్యాపకులు, విద్యార్థులతో సీఈఓ నీలిమా

ఘట్‌కేసర్: మహిళాభివృద్ధిలో కుటుంబ మద్దతు కీలక పాత్ర పోషిస్తుందని అనురాగ్ యూనివర్సిటీ సీఈఓ సూర్యదేవర నీలిమా అన్నారు. వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీ(ఏయూ)లో ఇన్‌స్పైర్ ఎక్సలెన్స్ సదస్సు గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. లింగ సమానత్వాన్ని ప్రోత్సహించాలని సూచించారు. నిరంతర అభ్యాసం వృత్తిపరమైన విజయాలకు తోడ్పాటు అందిస్తాయన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కనుల పండువలా..





- వేడుకగా కీసరగుట్ట బ్రహ్మోత్సవాలు
- రెండోరోజు యజ్ఞాలు, వేద పారాయణం

కీసర: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు(గురువారం) కీసరగుట్ట దేవాలయంలో ప్రత్యేక పూజాకార్యక్రమాలు జరిగాయి. వైదిక కార్యక్రమాల సంధానకర్త పుల్లేటికుర్తి గణపతిశర్మ ఆధ్వర్యంలో టీటీడీ వేదపాఠశాల విద్యార్థులు ఉదయం నుంచి సాయంత్రం వరకు యజ్ఞాలతో పాటు వేద పారాయణం గావించారు. రుద్రస్వాహాకార హోమం, ప్రదోష కాల పూజ, హారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాద వినియోగం తదితర కార్యక్రమాలు కొనసాగించారు. గర్భాలయంలో కొలువైన స్వామివారికి ఉదయం మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, సాయంత్రం బిల్వార్చన నిర్వహించారు. కల్యాణోత్సవం కోసం గురువారం రాత్రి స్వామివారిని గుట్టకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. నేడు(శుక్రవారం) మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని స్వామివారి దర్శనార్థం యాత్రికులు పెద్ద ఎత్తున గుట్టకు చేరుకుంటున్నారు.

కళకళలాడిన పోచమ్మ అంగడి

ఏటా కీసరలో మహాశివరాత్రి ముందురోజు జరిగే పోచమ్మ అంగడి గురువారం ఉత్సాహంగా జరిగింది. కాప్రా, యాప్రాల్‌తో పాటు నగరం నలుమూలల నుంచి ముఖ్యంగా తమిళులు ఇక్కడకు చేరుకొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. కొందరు తమ సాంప్రదాయాన్ని పాటిస్తూ ఎండ్లబండ్లపై కీసరకు చేరుకోవడం విశేషం. బ్రహ్మోత్సవాల సందర్భంగా గుట్టలో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

నేడు ప్రత్యేక పూజలు

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని నేడు(శుక్రవారం) దేవాలయంలో ఉదయం 4 గంటలకు మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, ఉదయం 6 గంటల నుంచి సామూహిక అభిషేకాలు, 9 గంటలకు రుద్రస్వాహాకార హోమం, రాత్రి 8 గంటలకు నందివాహన సేవ, 10 గంటలకు భజనలు, 12 గంటలకు రామలింగేశ్వర స్వామివారికి సంతత ధారాభిషేకం(లింగోద్భవ కాలంలో) ఉంటుంది.

వేడుకగా స్వామివారి కల్యాణం



కీసర: బ్రహ్మోత్సవాల్లో ముఖ్య ఘట్టమైన భవానీ, శివదుర్గా సమేత రామలింగేశ్వర స్వామివార్ల కల్యాణం గురువారం రాత్రి అశేషభక్తజనుల సమక్షంలో శోభాయమానంగా జరిగింది. గురువారం రాత్రి 8 గంటల సమయంలో కీసరలో స్వామివారిని మేళతాళాలతో వేదపండితులు ఎదుర్కోలు జరిపారు. నందివాహన సేవ ద్వారా కీసరగుట్టకు స్వామివారు చేరుకోగా.. వేదపండితులు కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ప్రభుత్వం తరఫున స్వామివారికి పట్టువస్త్రాలు అందజేశారు. ఉత్సవంలో ఆలయ చైర్మన్ నాగలింగం దంపతులు, ఉన్నతాధికారులు, ఈఓ నరేందర్, ట్రస్టు బోర్డు సభ్యులు, ఫౌండర్ ట్రస్టీలు పాల్గొన్నారు.

కీసర యాత్రికుల కోసం అన్నదానాలు



మున్నూరుకాపు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఏసీపీ నరేందర్, సీఐ వెంకటయ్య తదితరులు

కీసర: కీసర బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని గుట్టలో రామలింగేశ్వరస్వామి మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని గురువారం కుషాయిగూడ ఏసీపీ నరేందర్, కీసర సీఐ ఎం.వెంకటయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గుట్టకు వచ్చే యాత్రికుల కోసం అన్నదాన కార్యక్రమాల నిర్వహణకు వివిధ సంఘాలు ముందుకురావడం సంతోషకరమన్నారు. మరోవైపు కీసరగుట్టలోని రెడ్డి భవనం వద్ద రెడ్డి సంక్షేమ సంఘం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని కీసర పీఏసీఎస్ చైర్మన్, రెడ్డి భవన నిర్మాణ స్థల దాత గుర్రం మల్లారెడ్డి ప్రారంభించారు. ఆర్యవైశ్య నిత్యాన్నదాన సత్రం, వంశరాజ్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలోనూ అన్నదాన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. కార్యక్రమాల్లో మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు చిందం మహేందర్ పటేల్, కార్యదర్శి చెంది శ్రీనివాస, కోశాధికారి వెంకటేశ్వర్లు, వేల్పుల శ్రీనివాస్, లక్కాకుల సురేశ్, రమేశ్, కీసర రెడ్డి సంఘం అధ్యక్షుడు నల్ల మధుసూదన్‌రెడ్డి, రామిడి విజయ్‌రెడ్డి, గుర్రం లక్ష్మారెడ్డి, చర్లపల్లి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

సీఐకి సన్మానం



నూతన సీఐని అభినందిస్తున్న ముత్యాయాదవ్, రాధాకష్ణముదిరాజ్

ఘట్‌కేసర్: స్థానిక సీఐగా బాధ్యత స్వీకరించిన సైదులును టీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు గురువారం పోలీస్‌స్టేషన్‌లో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ముత్యాలు యాదవ్, రాధాకృష్ణ ముదిరాజ్, వర్కింగ్ ప్రెసిడెంట్ మత్స్యేందర్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ మాధవరెడ్డి, టీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్ష, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌గౌడ్, సుధాకర్‌రెడ్డి తదితరులు సీఐని శాలువాతో సన్మానించి.. పూలమొక్క అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు రమాదేవి, ఆంజనేయులు గౌడ్, వెంకట్‌రెడ్డి, మల్లేశ్, మహిళ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి సగ్గు అనిత, మాజీ సర్పంచ్ వెంకటేశ్ ముదిరాజ్, డీసీసీ కార్యదర్శి ఆంజనేయులు యాదవ్, రాజరత్నం, ఎన్ఎస్‌యూఐ నియోజకవర్గ అధ్యక్షుడు సాయిచరణ్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు సంజీవరెడ్డి, ఎఫ్‌సీఎస్ డైరెక్టర్ ధర్మారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సంజీవ ముదిరాజ్, మురళీగౌడ్, సత్తిరెడ్డి, కాంగ్రెస్ మున్సిపల్ కోశాధికారి శశిధరన్, ఆంజనేయులు యాదవ్, శ్రీనివాస్, సిరాజ్ పాల్గొన్నారు.

నిశ్చితార్థం చేసుకొని వచ్చేలోపు చోరీ

ఘట్‌కేసర్: కూతురు నిశ్చితార్థం పూర్తి చేసుకొని తిరిగి వచ్చేలోపు ఇంట్లో చోరీ జరిగిన సంఘటన ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు.. మున్సిపాలిటీకి చెందిన సార నర్సింగ్‌రావు పెద్ద కూతురు నిశ్చితార్థం స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో బుధవారం జరిగింది. కార్యక్రమం పూర్తయిన తర్వాత రాత్రి ఇంటికి వచ్చేసరికి మెయిన్ డోర్, బీరువా సైతం తెరిచి ఉన్నాయి. బీరువాలో వెతకగా ఆరు లక్షల నగదు, ఆరు తులాల బంగారం కనిపించకపోవడంతో పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా, చోరీ జరిగిన తీరు, బాధితులు నర్సింగ్‌రావు, కుటుంబ సభ్యులు విచారణలో చెప్పిన సమాధానాలు పొంతన లేపోవడంతో పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మారు తాళం చెవితో తెలిసిన వారే చోరీ చేసి ఉంటారని వారు భావిస్తున్నారు.

సీఎం సభను సక్సెస్ చేస్తాం

- కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వజ్రేశ్ యాదవ్
- ఈనెల 9న గుండ్లపోచంపల్లి పరిధిలో భారీ బహిరంగ సభ



మీడియా సమావేశంలో వజ్రేశ్‌యాదవ్, నక్కా ప్రభాకర్‌గౌడ్, నాయకులు

మేడ్చల్‌రూరల్: ముఖ్యమంత్రి హోదాలో తొలిసారి మేడ్చల్‌కు వస్తున్న రేవంత్‌రెడ్డికి ఘన స్వాగతం పలికి, నియోజకవర్గంలో మొదటి సభను 50 వేల మందితో నిర్వహిస్తామని మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి తోటకూర వజ్రేశ్ యాదవ్ అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని సీఎం సభ ప్రాంగణం వద్ద గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 9వ తేదీ సాయంత్రం 5 గంటలకు కాంగ్రెస్ పార్టీ నిర్వహించే సభకు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పాల్గొంటారని చెప్పారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. గతంలో ఈ ప్రాంత ఎంపీగా పనిచేసిన రేవంత్‌రెడ్డికి స్థానిక సమస్యలపై అవగాహన ఉందని.. వాటి పరిష్కారం దిశగా కార్యక్రమాలు చేపట్టేందుకు సీఎం సభ ఏర్పాటు చేశామన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందనుకోలేదు..

మేడ్చల్ ప్రాంత ప్రజలు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని అనుకోలేదని, అందుకే తాను ఓటమి చెందానని వజ్రేశ్ యాదవ్ అన్నారు. మరోవైపు మల్లారెడ్డి ఎన్నికల్లో వేల కోట్ల రూపాయలు ఖర్చు చేశారని, ఆయన మోసాలను బయటపెడతానన్నారు. తాము తలుపులు తెలిస్తే బీఆర్ఎస్ పార్టీలో ఎవరూ మిగలరని చెప్పారు.

మల్లారెడ్డిని పార్టీలోకి రానివ్వం

మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి కాంగ్రెస్ పార్టీలోకి వచ్చేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారని, ఇలాంటి భూ బకాసురులను పార్టీలోకి రానిచ్చేది లేదని కాంగ్రెస్ రాష్ట్ర నాయకలు నక్కా ప్రభాకర్ గౌడ్ అన్నారు. ఇదిలా ఉండగా, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో 44వ జాతీయ రహదారి పక్కన నిర్వహించ తలపెట్టిన సీఎం సభాస్థలి ఏర్పాట్లను గురువారం ఉదయం మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి వజ్రేశ్‌యాదవ్, స్థానిక నాయకులు సాయిపేట శ్రీనివాస్, రమణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సత్యనారాయణలతో కలిసి పరిశీలించారు. సాయంత్రం సైబరాబాద్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్, డీసీపీ నితిక పంత్, ట్రాఫిక్ ఏసీపీ, అధికారులు, సీఐలు పరిశీలించారు.

ఏర్పాట్లపై కలెక్టర్ పరిశీలన



కండ్లకోయలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్

ఈ నెల 9న సీఎం పర్యటన సందర్భంగా ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు లేకుండా పకడ్బందీగా చేయాలని మేడ్చల్ కలెక్టర్ గౌతమ్ అన్నారు. కండ్లకోయలోని సీఎం పర్యటన స్థలిని అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, సైబరాబాద్ అడిషనల్ సీపీ జోయెల్ డెవిస్‌లతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. స్వయం సహాయక సంఘాలతో సీఎం ముఖాముఖి కార్యక్రమం నేపథ్యంలో పటిష్ట ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈఓ దిలీప్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ సాంబశివరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.